ఎఫ్. ఆర్. ఎస్ గారు, తిరునల్వేలిలో, యీమధ్యనే వొక సన్మానం సందర్భంలో జవాబిస్తూ ఏం చెప్పారంటే!

"అప్పెండిసైటిస్ అనే వ్యాధి నాగరికత వృద్ధి పొందడంవల్ల వ్యాప్తి అయినది. ఇప్పటి నాగరిక భోజనంలో విటమినులు లేవు. బి. విటమినుు అసలే లేదు. కనకనే మన రోగనిరోధకశక్తి క్షీణించి పోతున్నది."

దీని లక్షణాలూ, నిదానమూ, శస్త్రచికిత్సావిధానాలూ—వీటిని గురించి చెప్పి పాలుగా రింకా యేమన్నా రంటే?

"నా వైద్యానుభవంలో తాటిచెట్టునుంచి తియ్యబడ్డ తీపికల్లు, కొందరికి ఈఅప్పెండిసైటిస్ వ్యాధిని నివారణ చేసింది. ఇది పరిశోధించి చూడవలసిన వస్తువు. తాడిచెట్టు తీపికల్లు యీస్టు (నురగ?) లో బి. విటమిను చాలా అధికంగా వున్నది. రోగులకు అది యెంతో నిరోధకశక్తి కలిగిస్తుంది. వ్యాధిని నిర్మూలించే శక్తికూడా దానికున్నది" అని ఆయన బాగా నమ్ముతున్నారు.

పుష్టికరమూ, ఔషధమై చాలా పని చేసేదీ అయిన యీతీపికల్లును వాడీ, పరిశోధించీ తెలుసుకోవలసిన దెంతో వున్నది. ఈపనులు చెయ్యడానికి నవకాశాలున్నూ యెన్నో వున్నవి. దయాళులైన వైద్యులున్నూ, ప్రకృతిశాస్త్రజ్ఞులున్నూ దీనివిషయమై యెంతో పని చెయ్యగలరు. వారు, నానాబాధలూ పడుతూ తినడానికి కూడా యేమీ లేని కోట్లకొలది మన దేశీయులకు—అందులోనూ పల్లెటూరివారికి ఈ విధంగా ఎంతో సేవచేసి, వారు ఆనందించవచ్చు. అనుభవపరులైన పరిశోధకుల నివేదికలనూ, స్వయంగా వాడి దాని శక్తి తెలిసికొన్నవారి నివేదికలనూ వార్తాలో వున్న ఏ. ఐ. వి. ఐ. ఏ. వారి బెల్లపుడిపార్టుమెంటువారు వందనపూర్వకంగా స్వీకరిస్తారు."

---

# నిజాంరాష్ట్రమూ—మనఆంధ్రులున్నూ

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

3

రెండో వ్యాసంలో కార్యనిర్వాహకసభలో పనిచేసే సభ్యుల పరిపాలనలో వుండే శాఖలు వివరించాను. వాటివివరా లికనూడు.

## మాల్గుజారి

అంటే రెవెన్యూశాఖ. రాష్ట్రాదాయం అంతటిలోనూ భూమిపన్నుల ఆదాయమే పెద్దది. తద్వారా యీశాఖ ఏప్రభుత్వానికైనా చాలా ముఖ్యమైనది.

ఈరాష్ట్రం మన హిందువుల పరిపాలనలో వుండేటప్పుడు పంటలో ఆరో భాగం పుచ్చుకునేవారు. మహారాష్ట్రులు నాలుగో (చౌత్) భాగం పుచ్చుకునేవారు. ప్రతీగ్రామానికీ వొక పటేలూ, వొక పట్వారీ వుంటారు. కొన్ని గ్రామాల పటేళ్లమీద అధికారి దేశముఖు. అలాగే కొన్ని గ్రామాల పట్వారీలమీద అధికారి దేశపాండ్యా. దేశముఖులమీద సర్ దేశముఖులు. దేశపాండ్యాలమీద సర్ దేశపాండ్యాలు.

గోల్కొండనవాబులు ఈపద్ధతినే అనుసరించారు.

రాష్ట్రం అసఫ్‌జాః వంశంవారి స్వాధీనమైనది. మొదటి నిజాముల్ ముల్కు కాలంలో యీరాష్ట్రం ౬ సుబాలుగానూ, ౫౩ సర్కారులుగానూ, ౧౨౩౬ మహాలులుగానూ విభక్తం అయినది. తరవాత కొన్నాళ్లకి మళ్లీ సర్కారులను పరగణాలకింద విభజించారు. ప్రతీపరగణాను ఇంత శిస్తు అని నిర్ణయించి గుత్తేదారుకో, తాలూక్దారుకో, ఒక సంవత్సరానికో, మూడేళ్లకో, గుత్త కిచ్చేవారు. ఆగుత్తేదారులూ, తాలూక్దారులూ దేశముఖులనూ, దేశపాండ్యాలనూ సాయం పుచ్చుకుని శిస్తు వసూలు చేసి నిర్ణయించబడ్డ మొత్తం నవాబుకి చెల్లించి తతిమ్మా తాము వాడుకునేవారు.

అప్పుడు భూములకు కొలతలు లేవు. పన్ను భూమిపరిమితినిబట్టి కాక, కాడి కింత అనీ, ఎద్దు కింత అనీ వసూలు చేసేవారు. రెండెడ్లుంటే ౫ మొదలు ౧౦ రూపాయలదాకా పుచ్చుకునేవారు. నాలుగెడ్లుంటే ౧౦ మొదలు ౨౫ రూపాయలదాకా పుచ్చుకునేవారు.

ఈభూమిపన్నే కాక ఉపకిందివృత్తుల పన్ను కూడా అప్పు డుండేది.

| | | |
|---|---|---|
| ౧. ధంగర్ పట్టీ | అంటే | గొల్లలమీద |
| ౨. ఢేడ్ పట్టీ | ,, | మాల మాదిగల మీద |
| ౩. షాదీపట్టీ | ,, | పెళ్లిళ్లమీద |
| ౪. చర్సపట్టీ | ,, | తోళ్లమీద |
| ౫. భోయీపట్టీ | ,, | బోయీలమీద |
| ౬. హాట్ బాజారీ | ,, | సంతలమీద |
| ౭. కలాల్ పట్టీ | ,, | కల్లుదుకాణాలమీద |
| ౮. జులాహాపట్టీ | ,, | సాలెవాళ్లమీద |
| ౯. ధారాపట్టీ | ,, | లోకల్ ఫండువంటిది |
| ౧౦. రాహదారీపట్టీ | ,, | మార్గస్థులమీద |
| ౧౧. గనీంబాబ్ | ,, | శత్రువులనుంచి రక్షించినందుకు |
| ౧౨. పరాలపట్టీ | ,, | గడ్డి అమ్మకం మీద |
| ౧౩. బట్ సబ్జీ | ,, | కూరగాయల అమ్మకంమీద |
| ౧౪. బాన్సఫరోషీ | ,, | బొంగుల అమ్మకంమీద |
| ౧౫. మజ్దూరీపట్టీ | ,, | కూలీలమీద |
| ౧౬. రెడ్డిరుసుము | ,, | రెడ్డిగారికి చెల్లించేది |
| ౧౭. దఫన్ | ,, | శవాలు పూడ్చినందుకు |
| ౧౮. తైలీ, పాన్ పట్టీ | ,, | నూనె-తమలపాకుల అమ్మకంమీద |
| ౧౯. మచ్ఛీపట్టీ | ,, | చేపలవృత్తిమీద |
| ౨౦. కుంభార్ పట్టీ | ,, | కుమ్మరిల్విచ్చవలసింది |
| ౨౧. భైంస్ పట్టీ | ,, | దున్నపోతు ఉన్నవారివ్వవలసింది |
| ౨౨. ఆదంపట్టీ | ,, | హిందూ శిల్పుల మీద |
| ౨౩. మొహతర్ఫా | ,, | మగ్గాలమీద |
| ౨౪. సఫర్ పట్టీ | ,, | జమీందారు కమాను ఖర్చులకు |

ఇంకా యిలాంటివి చాలా వుండేవి. ఇప్పుడు వీటిలో నూటికి తొంభైపాళ్లు తీసివేశారు.

సాలార్జంగుగారు దివాను పదవి స్వీకరించాక గుత్తాపద్ధతి తీసివేశారు. భూములు కొలిపించి పరిమితిని పట్టి పన్నుల యేర్పాటు చేశారు.

అప్పుడు తమకి నష్టం కలగడంవల్ల గుత్తేదారులు తిరుగుబాటు చేశారు. చాలా అల్లరు జరిగాయి. దానిమీద వొకటిరెండుమాట్లు బ్రిటిషుసైన్యం సహాయం కూడా పుచ్చుకుని వాటిని అణచివేశారు.

ఇప్పుడు రాష్ట్రం అంతటా సెటిల్ మెంటు జరిగి వున్నది. కొన్ని జాగీర్లలోనూ, సంస్థానాలలోనూ మాత్రం పూర్వపద్ధతే నడుస్తున్నది.

## కరోడగిరి (కస్టమ్సు)

మద్రాసు, బొంబాయి, కలకత్తా వంటి రేవుస్థలాలలో ఖండాంతరాలనుంచి వచ్చే సరుకులమీద సుంకం వసూలు చెయ్యబడుతుంది. సరుకు ఎక్కడి దయినా సరే నిజాం రాష్ట్రంలో ప్రవేశిస్తే యిలాగే సుంకం వసూలుచేస్తారు. దీన్ని కరోడగిరి అంటారు. నిజాంరాష్ట్రం చుట్టూ ఇలాంటి పన్ను వసూలు చెయ్యడానికి ఏర్పాట్లున్నవి. వర్తకులే కాక ప్రయాణీకులు కూడా మూటా ముల్లే విప్పి అధికార్లకు చూపించి సుంకం చెల్లించవలసిన వస్తువు లుంటే చెల్లించితీరవలసిందే.

## ఆబ్కారీ

మద్యపానమూ, మద్యాదాయమూ ప్రపంచ మంతటా వున్నది. కర్మభూమి అయిన మన భరతఖండం అంతటా వున్నది. నిజాం రాష్ట్రంలోనూ వున్నది.

తక్కినచోట్ల లాగే నిజాంరాష్ట్రంలో కూడా భూమ్యాదాయం తరవాత మద్యాదాయం అంత వున్నది. అయితే, మొన్న మొన్నటిదాకా ప్రభుత్వం యీవిషయమై కలగచేసుకోలేదు. కల్లు సారా వగైరా మధుపదార్థాలు ప్రజలు ఎవరి కిష్టంవచ్చినంతా వారు తయారుచేసుకుని సేవిస్తూ వుండేవారు.

ఇటీవలే ప్రభుత్వం దీన్ని వొక శాఖగా ఏర్పరిచింది ఇక్కడలాగే కల్లంగళ్లు వేలంపాట పద్ధతిలో ఏర్పడుతూ వుంటాయి. నల్లమందూ, గంజాయీ బ్రాందీలు వగైరాలు కూడా వేలంపద్ధతిమీదే అంగళ్లేర్పడుతూ వుంటాయి.

## అడవులు

నిజాము రాష్ట్రంలో ౯౮-౨౦ చదరపుమైళ్ల అడవులున్నవి. అనేకరకా లున్నవి. చిట్టడవులూ కీకారణ్యాలూ కూడా వున్నవి ౧౩౪౨ ఫసలీలో దీనికోసం అయిన ఖర్చు ౮,౧౦,౯౫౦-౦-౦ ఆదాయం ౧౩,౦౬,౩౫౯-౦-౦. ఇందులో చాలాభాగం వంటచెరుకువల్లా కలపవల్లా వస్తుంది. గడ్డివగైరాలవల్ల కూడా కొంత వస్తుంది. కరవుల్లో మాత్రం పశువులను వుచితంగా మేపుకోనిస్తారు.

## పోలీసు

ఇందులో రెండు భాగాలు. ఒకటి కేవలమూ హైదరాబాదు నగరానికి మాత్రమే సంబంధించినది. రెండోది రాష్ట్రాని కంతటికీ సంబంధించినది. నగరశాఖ ప్రధానాధికారికి మొగలాయీల కాలంనుంచీ కొత్వాల్ అని పేరు. బ్రిటిషిండియాలో పోలీసుకమిషన రంటారు. కొత్వాలు కింద మదద్గారులూ, వారికింద సదరమీనులూ, వారికింద అమీనులూ, అమీనులకింద జమేదారులూ, జమేదారులకింద జవానులూ వుంటారు. నగరంలో వున్న జవానుల సంఖ్య ౧౩౪౨ ఫసలీలో ౩౩౩౩ గురు.

నగరశాఖ పని రౌడీలను హద్దులలో వుంచడమూ, రాకపోకలు సద్దడమూ, దొంగతనాలు హత్యలూ వగైరా జరక్కుండా చూడడమూ, దోషులను పట్టుకోవడమూ వగైరా చాలా వుంది.

సి. ఐ. డి. పోలీసుశాఖ కూడా వున్నది. ఆశాఖలో స్త్రీలు కూడా పని చేస్తున్నారు.

కొత్వాలు కచ్చేరీలాగే, నగరంలో, రాష్ట్రీయపోలీసు అధికారి కచ్చేరీ కూడా వున్నది. ఈ శాఖలో పెద్ద అధికారి హోదా డైరక్టర్ జనరల్ అని. (సదర్ నాజిం) ఇతనికి కొందరు మదద్గారు లున్నారు. ఈ మదద్గారుల కిందివారు జిల్లా సూపరెంట్లు (మొహతెమీములు) వారికింద సర్కిల్ ఇన్‌స్పెక్టర్లూ, వారికింద ముంతజములూ, వారికింద మొహరిర్లూ, దఫేదారులూ, జవానులూ వున్నారు.

ఇప్పుడు జిల్లాలలో

పోలీసు అధికార్లు ౧౬౨౨ మందీ.

జవానులు (కాన్‌స్టబుల్సు) ౯౯౬౩ మందీ వున్నారు.

సర్ఫ్ ఖాసులో

పోలీసు అధికారులు ౧౫౭ గురూ,

జవానులు ౧౭౯౩ గురూ వున్నారు;

## రైల్వే

రాష్ట్రంలో వొక యింగ్లీషుకంపెనీవారు, రైల్వే ప్రారంభించి "నిజాం గారంటీడ్ స్టేట్ రెయిల్వే" అనే పేరితో నడిపేవారు. ౧౯౩౦ లో నైజాముగారు ౧౬,౬౦,౦౦ ౦౦౦ రూపాయలకు దాన్ని కొనేశారు. ఆరెయిల్వేకంపెనీ, అప్పటికి నైజాము గారికి ౩౬,౩౦,౦౦౦ పౌండ్లు బాకీ తేలారు. నైజాముగారు అది మినహాయించుకుని. తతిమ్మా ౪౨,౪౦,౦౦౦ పౌండ్లూ యిచ్చేసి రెయిల్వే స్వాయత్తం చేసుకున్నారు. ఇప్పుడు నిజాంరాష్ట్రంలో ౧౨౯౦ మైళ్ల రెయిల్వే వున్నది. అందులో ౬౬౬ మైళ్ళు పెద్ద లైను. ౬౨౪ మైళ్లు చిన్న లైను.

కరీంనగరు, మెదకు, నల్లగొండ వగైరా తెనుగుజిల్లాలలో యింకా రెయిల్వే పడలేదు.

## పోస్టు

నిజాం రాష్ట్రంలో ౫౯౪ పోస్టాఫీసు లున్నవి. ఉత్తరాల డబ్బాలు [illegible] ఘనీలతో [illegible] రాష్ట్రం [illegible] వున్న పోస్టాఫీసులను చూస్తే ౧౦౪ చదరపు మైళ్ల కొకటిచొప్పున వున్నది.

వారానికొకమాటు కొన్ని గ్రామాలకూ, రెండువారాల కొకమాటు కొన్నిగ్రామాలకూ టపాబంట్రోతులు వెడుతూ వుంటారు. కార్డులూ, కవర్లూ, రిజస్టరుడు జాబులూ, వీ. పీ. లూ, మనియార్డర్లూ పంపుకోవచ్చును.

రాష్ట్రంలో పోస్టలుసౌకర్యా లింత తక్కువగా వున్నా కార్డులూ, కవర్లూ వగైరా వెల చాలా తక్కువ. ఈసంగతి బోధపడడానికి కింది సంగతులు తెలుసుకోవాలి.

ఇక్కడి మన రూపాయకూ, అక్కడి నైజాంగారి రూపాయకూ మారకంరేటు ౧౬ పైసలు. అంటే ఆరూపాయి వొకటీ పైసలు పదహారూ యిస్తేగాని మన రూపాయ వొకటి రాదు. రూపాయకు ఇక్కడి లాగే రెండర్ధలూ, నాలుగు పావలాలూ, యెనిమిది బేడలూ, పదహారణాలూ వున్నవి. అణాకు ఆరుపైసలు. అక్కడ మన డబ్బుల వంటివి లేవు. అక్కడి కార్డు ఖరీదు ఆపైసలు రెండు.

నైజాముగారికి టెలిగ్రాఫ్ లేదు. రాష్ట్రంలో వున్న దంతా బ్రిటిషువారిది. ఇప్పుడు రెయిలు స్టేషను లున్నచోట్లకు మాత్రం నైజాంగారి టెలిగ్రాఫ్ వున్నది. బ్రిటిషిండియావూళ్లకు గాని, విదేశాలకు గాని టెలిగ్రాము లిచ్చుకోవా లంటే బ్రిటిషు పోస్టాఫీసులో యిచ్చుకోవాలి. నగరంలో బ్రిటిషుపోస్టాఫీసు వున్నది. అక్కడ, దాన్ని, ఇంపీరియల్ పోస్టాఫీసు అంటారు.

ఇంపీరియల్ పోస్టుడబ్బాల రంగు యెరుపు, నైజాము పోస్టుడబ్బాల రంగు పసుపు.

నైజాము స్టేటు రంగు పసుపు. నైజాము గవర్నమెంటుని చూసే కాబోలు మన కాంగ్రెస్సువారు పసుపురంగు కోరుకున్నారు. అంచేతే కాబోలు మన కాంగ్రెస్సు మంత్రాంగం కూడా నైజాము గవర్నమెంటులాగే నిరంకుశంగా నడుస్తున్నది.

## న్యాయస్థానములు

నిజామురాష్ట్రంలో కూడా బ్రిటిషిండియాలో లాగే న్యాయస్థానా లున్నవి.

ప్రతీతాలూకాపట్టణంలోనూ మున్సిఫ్‌కోర్టున్నది. దాని అధికారి మున్సిఫ్.

ప్రతీజిల్లానగరంలోనూ మున్సిఫ్‌కోర్టుమీద అప్పీళ్లకు జిల్లా కోర్టున్నది.

దాని అధికారి పేరు నాజిమ్.

ప్రతీ సుబానగరంలోనూ జిల్లాకోర్టుమీద అప్పీళ్లకు సుబా కోర్టున్నది. దానిపేరు సదర్ అదాలతు. దాని అధికారి సదర్ నాజిమ్.

హైదరాబాదులో సదర్ అదాలతుమీద అప్పీళ్లకు హైకోర్టున్నది. దానిని వుర్దూలో అదాలతుల్ ఆలియా అంటారు. హైకోర్టులో న్యాయమూర్తులు తొమ్మండుగురు. హైకోర్టు న్యాయమూర్తిని జుడుస్ అంటారు.

ఒక్కొక్క సందర్భంలో యీ హైకోర్టుమీద అప్పీళ్లకు అగత్యం కలుగుతూ వుంటుంది. అందుకోసం దానిమీద జూడిషియల్ కమిటీ వున్నది.

నిజామురాష్ట్రంలో, దీవానీ అనీ, ఫౌజ్దారీ అనీ న్యాయం రెండు రకాలుగా వున్నది.

దీవానీలో సివిల్ వ్యవహారాలూ, ఫౌజ్దారీలో క్రిమినల్ వ్యవహారాలూ పరిష్కరించబడతవి.

ఇవి కాక, హైదరాబాదు నగరం కోసం దీవానీబల్దాకచేరీలనీ, ఫౌజ్దారీబల్దాక చేరీ లనీ ప్రత్యేకంగా వున్నవి.

మన బ్రిటిషిండియాలో మున్సిఫ్ కోర్టులవరకూ ఆయాజిల్లాల భాషే వ్యవహారభాష. నిజాము రాష్ట్రంలో అంతటా వుర్దూలోనే వ్యవహారం.

రాష్ట్రం అంతటా వున్న న్యాయస్థానాల తనిఖీనిమిత్తం, యిటీవల, ఇన్స్పెక్టర్ జనరల్ అని వొక అధికారి యేర్పడివున్నాడు.

పదిసంవత్సరాల కిందటే నిజాము రాష్ట్రంలో న్యాయశాఖా కార్యనిర్వాహక శాఖా వేరుచెయ్యబడ్డవి.

మన బ్రిటిషిండియాలో నేటికి కూడా—కాంగ్రెసు ప్రభుత్వంలో కూడా యీసంస్కరణ జరగలేదు.

ఇస్లాముమతసంబంధ మైన తగువులు తీర్చడానికి నగరంలో వేరే కోర్టున్నది. దాని పేరు "దారులఖజా" దాని అధికారి నాజిమ్. ఆకచేరీలో మస్లిముల వివాహసంబంధమైన వ్యవహారాలూ, భార్యల భరణాలూ, తల్లాకులూ—అంటే పురుషుల విడాకులూ, ఖులా—అనగా భార్యలు భర్తలకు విడాకు లివ్వడమూ, వారసుల నిర్ణయమూ, బీజనిర్ణయమూ అనగా "ఈమనిషి ఫలానావాడి కొడుకవునా కాడా" అని నిర్ణయించడమూ, మహరూ—అంటే ఓలీ మొదలైనవాటిని గురించి విచారణా, తీర్పూ చెయ్యబడుతూ వుంటవి.

ఇదివరకి, ఖూనీ చేసినవారికి, హైకోర్టులో శిరచ్ఛేదశిక్ష విధించినప్పుడు, షరా ప్రకారం చెల్లుతుందా చెల్లదా అనే తీర్పు చెప్పడానికి ముఫ్తీ అని వొక అధికారి వుండేవాడు. ఇప్పుడు ఆయేర్పాటు లేదు. కాని బ్రిటిషిండియాలో వున్న వొక ముఫ్తికి నెల జీతంయిస్తూ ఇప్పటికీ అతని అభిప్రాయం తెలుసుకుంటూవుంటారు.

హైదరాబాదు నగరంలో మాత్రమే స్మాల్ కాజు కోర్టున్నది. దీన్ని అదాలతే ఖఫీఫా అంటారు. తాలూకాలలోనూ, జిల్లాలలోనూ యీకోర్టులు లేవు. మున్సిఫ్ల దర్జానూ, నాజిముల దర్జానూ బట్టి ఈస్మాల్ కాజు వ్యవహారాలు పరిష్కరించడానికి కూడా వారికే అధికారం ఇవ్వబడ్డది. నగరంలో ౨ వేలకు లోపలి వ్యవహారాలన్నీ స్మాల్ కాజు కోర్టులో పరిష్కారం కావాలి. ఈకోర్టుకి స్థిరాస్తితో సంబంధం లేదు.

## ఆర్కియాలజీ

సంస్కృతంలో యిది ఆర్ష శాఖ. లేక పురాతత్వశాఖ. వురుదూలో ఆసారే ఖదీమా అంటారు.

నిజామురాష్ట్రం, ప్రాచీనమైన కోటలూ, మసీదులూ, దేవాలయాలూ మొదలైనవాటికి భాండారంలా వున్నది. అవిధాలైనవి యీరాష్ట్రంలో వున్నన్ని మరెచ్చటా లేవు. వీటిని జాగ్రత్తగా వుంచడంకోసం యీశాఖ యేర్పాటైనది.

నిజామురాష్ట్రంలో ఎన్నో రాజ్యాలు వెలసినవి. సామ్రాజ్యాలున్నూ వెలసినవి. వాటి తాలూకు శిథిలాలు ఇంకా లక్షలు నిలిచి వున్నవి. గోల్కొండ, వరంగల్లు దౌలతాబాదు, దేవరకొండ, రాచకొండ మొదలైన దుర్గములూ, అజాంతా యెల్లోరా మొదలైన గుహలూ, సాటిలేని చిత్రములూ,—వీటిని నైజాము గవర్నమెంటు చాలా జాగ్రత్తగా కాపాడుతున్నది. ఈరాష్ట్రంలో శిలాశాసనాలూ, తామ్రశాసనాలూ, తాళపత్రగ్రంథాలూ వగైరాలు కనిపెట్టి భద్రపరచవలసినవే యింకా లక్ష లున్నవి. నింపాదిగా అయినా ఈశాఖ ఆవిషయమై మంచిపని చేస్తున్నది.

నిజాంరాష్ట్రంలో ప్రాచీననిర్మాణాల్లో ప్రధానమైనవి వాటి వివరాలతో యిక్కడ చూపిస్తున్నాను.

౧. అజాంతా—ఇది ఔరంగాబాదుకు ౬౦ మైళ్ళ దూరంలో వున్నది. కొండలలో గుహలు దొలిచి, ఆగుహాల గోడలకు గచ్చుపూసి ౨౨౦౦ యేళ్లకిందట వాటిమీద రంగులతో అద్భుతమైన చిత్రాలు చిత్రింపబడ్డవి. అవి యిప్పటికీ మంచిస్థితిలో వుండి లక్షల కొద్దీ రసికులను ఆకర్షిస్తున్నవి

౨. అలంపూరు. ఇది రాయచూరు జిల్లాలో వున్నది. రెయిల్వే స్టేషనున్నది. ఇక్కడ ౨౦౦౦ యేళ్లకిందటి శైవదేవాలయాలున్నవి.

3. ఔరంగాబాదు. స్టేషనున్నది. అసఫ్జాః ఔరంగజేబు పాదుషాల గోరీలూ, గుహలూ, కోటా వున్నవి.

౪. బిదర్—స్టేషనున్నది. కోట, అష్టద్వారాలూ, గోరీలూ వున్నవి.

౫. దౌలతాబాదు—ఔరంగాబాదుకి ౧౦ మైళ్లలో వున్నది. గొప్పకోట వున్నది.

౬ ఎల్లోరా—దౌలతాబాదుస్టేషనుకు రెండు మైళ్లలో వున్నది. గుహలూ, చిత్రాలూ వున్నవి.

౭. గోలకొండ—హైదరాబాదుకు నాలుగు మైళ్లలో వున్నది. గొప్పకోటా, గోరీలూ, మసీదులూ వున్నవి.

౮. ఇటుగీ—రాయచూరుజిల్లాలో కొప్పలుకు ౧౫ మైళ్లలో వున్నది. గొప్పదేవాలయ మున్నది.

౯. జాల్నా—ఔరంగాబాదు జిల్లాలోది. స్టేషనున్నది. కోటా, దేవాలయమూ, మసీదులూ వున్నవి.

౧౦. కల్యాణి—గుల్బర్గాజిల్లాలోది. స్టేషనున్నది. అద్భుత శిల్పము లున్నవి.

౧౧. గుల్బర్గా—స్టేషనున్నది. కోటా మసీదులూ వున్నవి.

౧౨. నాందేడు—నాందేడు జిల్లాలోది. స్టేషనున్నది. సిక్కుల దేవాలయా లున్నవి.

౧౩. పైఠన్—అంటే ప్రతిష్ఠానపురం, ఔరంగాబాదుకు ౨౦ మైళ్లలో వున్నది. దేవాలయాలూ, మసీదులూ వున్నవి.

౧౪. రాయచూరు—స్టేషనున్నది. ఇక్కడ వున్న గొప్పకోట కోసం మనవాళ్లూ, తురకలూ అనేక యుద్ధాలు చేశారు. కృష్ణరాయడు దీన్ని పట్టుటి జయించాడు.

౧౫. వరంగల్లు—స్టేషనున్నది. గొప్పకోటా, గొప్పదేవాలయ శిథిలాలూ వున్నవి. అనేకశాసనాలున్నూ వున్నవి. రుద్రమ్మా, ప్రతాపరుద్రుడూ సింహాసనాసీనులై వైరిగర్భనిర్భేదకంగా ప్రజాపరిపాలనం చేసిం దిక్కడే.

౧౬. యల్లందల—కరీంనగరుకు ౨౦ మైళ్లలో వున్నది. గొప్ప కోట వున్నది.

౧౭. హనుమకొండ—వరంగల్లు పక్కది. వ్యవహారరీత్యా యిప్పుడు వరంగల్లూ యిదీ నొకటే నగరం. వరంగల్లుజిల్లా ఆఫీసు లన్నీ యిక్కడే వున్నవి. రెండువూళ్లూ కలిసిపోతూనే వున్నవి.

౧౮. రామప్పగుడులు—వరంగల్లుకు నలభై మైళ్ల దూరంలో వున్నవి. మహారణ్యం మధ్య క్రూరజంతువుల విహారస్థలంలో వున్నవి. అద్భుతమైన శిల్పం. యూరపియనులు వేలకొద్దీ చూస్తూ వుంటారు. పగలే వెళ్లి రావాలి. రాత్రి అక్కడ వుండడం అపాయకరం. ఈ దేవాలయాల యిటుకలు నీటిమీద తేలుతవి.

౧౯. పానగల్లు—నల్లగొండకు నాలుగు మైళ్లలో వున్నది. గొప్ప దేవాలయా లున్నవి.

౨౦. పిల్లలమర్రి—నల్లగొండకు ౩౦ మైళ్లలో వున్నది. గొప్ప దేవాలయా లున్నవి.

౨౧. దేవరకొండ } ఇవిన్నీ నల్లగొండకు ౩౦ మైళ్లలో వున్నవి.
౨౨. రాచకొండ } గొప్ప కోట లున్నవి.

౨౩. కొలనుపాక—ఇది జైనుల పుణ్యస్థలం. గొప్ప జైనదేవాలయా లున్నవి.

౨౪. భద్రాచలం—మనదే. మనం యెరిగివున్నదే. (తక్కినవి మాత్రం మనవి కావు కనకనా? యెరగం కాని!)

౨౫. వేములవాడ—కరీంనగరుజిల్లాలోనిది. గొప్పదేవాలయా లున్నవి.

## మతశాఖ

మహమ్మదీయుల మతాభినిరతి కిది గొప్ప నిదర్శనం. ఇట్టిది యీరాష్ట్రంలోనే వున్నది. ఇది ప్రత్యేకశాఖ. పుస్తకాలలో దీని పేరు ఉమూరే మజహబీ. దీని అధికారి నాజిమ్.

నాజిమ్ ఆఫీసులో "మహమ్మదీయసంస్కరణశాఖ" అని వొక ప్రత్యేకశాఖ వున్నది.

మసీదులూ, దేవాలయాలూ, దర్గాలూ, వాటి యినాములూ—వీటి పరిశీలనకు ఈశాఖ పుట్టినది. మసీదులూ దేవాలయాలూ కట్టదలచినవారు ముందుగా ఈశాఖవారి సెలవు పొందాలి. హిందువులకు మాత్రం యీసెలవు గగనపుష్పం అవుతూ వుంటుంది.

మతవిషయికమైన నిర్ణయాలూ, ఫత్వాలూ అప్పుడప్పుడు ఈశాఖ ద్వారానే యివ్వబడుతూ వుంటవి.

రంజాన్ పండుగరోజుల్లో ముసల్మానులు కల్లు సారా వగైరా తాగకుండా వుండేటట్టు ఈశాఖవారు చాలా గట్టిగా ఆజ్ఞలు జారీ చేస్తారు. తక్కిన పండుగ సమయాల్లో అనేక విధములైన ఆజ్ఞలు జారీచేస్తూ వుంటారు.

మక్కాయాత్రకూ, తక్కిన పవిత్రస్థలాల యాత్రలకూ ముసల్మానులకు యీశాఖద్వారా, సర్కారు చాలా సదుపాయాలు చేస్తారు. సాధారణంగా యాత్రికులకు ఖర్చు లిస్తారు. ఆయాత్రికులలో సర్కారు వుద్యోగులైనవారికి జీతం నష్టం లేకుండా సెలవులు కూడా యిస్తారు. స్పెషల్ రెయిళ్లు నడుపుతారు.

నైజాము గవర్నమెంటులో ప్రతీడిపార్టుమెంటు తాలూకు రిపోర్టూ ప్రతీసంవత్సరమూ తప్పకుండా ప్రకటించబడుతుంది. ఒక్క యీమతశాఖ రిపోర్టుమాత్రం మినహా.

దీనివల్ల, ఏటా, ఇతరమతాలలో ముసల్మాను లెందరు చేరారో, మనవాళ్లు—అంటలోనూ గొర్రెలమందవంటి ఆంధ్రులు ఇస్లాము మతంలో యెందరు చేరారో తెలుసుకోడాని కవకాశాలు లేకుండా వున్నవి.

౧౩౪౨ ఫసలీలో ఈశాఖకూ, దీని ద్వారానూ అయినఖర్చు—

| | రూపాయలు |
|---|---|
| ౧. శాఖాపరిపాలనకు | ౧,౮౭,౨౪౮ |
| ౨. మసీదులు, దేవాలయాలు వగైరా | ౧,౬౮,౫౭౬ |
| ౩. మతపాఠశాలలు | ౧,౯౬,౭౩౧ |
| ౪. హాజీ యాత్రికులకు | ౩౨,౮౭౦ |
| ౫. మాముల్దారులకు | ౨,౭౧,౬౪౮ |
| ౬. ఈదుల (పండుగుల) నిమిత్తం | ౭౧,౫౨౫ |
| ౭. మతవిషయికదానాలు | ౨,౮౨,౭౭౭ |
| ౮. ఇండ్లు | ౭,౫౮౩ |
| మొత్తం | ౧౨,౧౮,౪౮౨ |

మతపాఠశాలలూ, మతవిషయికదానాలూ హిందూమతానికి సంబంధించినవీ, హిందువులకోసం ఖర్చు అయినవీ అవుతా యని చెప్పడానికి అవకాశంలేదు. అయినా కావడమే వస్తే చాలా కొద్ది అయి వుంటుంది.

మసీదులకూ, దేవాలయాలకూ అన్న పద్దులో కూడా దేవాలయాల విషయం యింతే అయి వుంటుంది. ఆరాష్ట్రంలో మతరీత్యా హిందువులకు కలుగుతున్న యిబ్బందులను బట్టి యిది యిలా అనుకోవలసి వస్తున్నది.

ఏమయినా యీమతశాఖ కేవలమూ ముస్లిములకే గాని హిందువులకు ప్రయోజనకారి కాదు.

## సైన్యం

నైజాముగారి సైన్యం రెండు రకాలుగా వున్నది.

౧. రెగులర్ (బాజాబితా) సైన్యం.

౨. ఇరెగులర్ (బేజాబితా) సైన్యం. దీన్ని నజం జమీయత్ అని పిలుస్తారు.

| | |
|---|---|
| రెగులర్ సైన్యంలో | ౪,౨౦౦ |
| ఇరెగులర్ సైన్యంలో | ౧౨,౫౩౪ |
| మొత్తం | ౧౬,౭౩౪ గురు సిపాయీలున్నారు. |

౧౩౪౨ ఫసలీలో సైన్యం కోసం అయిన ఖర్చులు ౮౮,౫౮,౦౧౩ రూపాయలు. ఈ మొత్తం నూటిలో పదిపాళ్లకు పైని అయినది.

## వైద్యశాఖ

నిజాము రాష్ట్రంలో కూడా అల్లోపతీ, యునానీ, ఆయుర్వేద వైద్యవిధానాలు వాడుకలో వున్నవి. కాని నైజాము సర్కారు అల్లోపతీవిధానానికే ప్రాధాన్యం చూపిస్తున్నారు.

హైదరాబాదులో అల్లోపతీ నేర్పే మెడికల్ కాలేజీ వున్నది. మద్రాసు జనరల్ ఆస్పత్రివంటి ఉస్మానియాఆస్పత్రికూడా వున్నది. ఇతదులో రోగులకు రాత్రీ పగలూ కూడా చికిత్స చేస్తారు.

ప్రతీ తాలూకా పట్నంలోనూ వొక ఆస్పత్రి వున్నది.

ఈ వైద్యశాఖవారు, మోటార్ల సాయంతో పల్లెటూళ్లలో సినీమా ప్రదర్శనాలు చేయించి ప్రజలకు ఆరోగ్యపద్ధతులు నేర్పుతున్నారు. రాష్ట్రంలో మలేరియా ఎక్కువగా వున్నది. దాన్ని పారదోలడం కోసం యెన్నో మాతులను పుట్టించారు. ఎంతో కిరోసిన్నూనె చల్లి దోమలను నాశనం చేయిస్తున్నారు. ఉచితంగా టీకాలు వేయిస్తున్నారు. నగరంలోనూ, రాష్ట్రంలోనూ వ్యాపించి వున్న ప్లేగు పోగొట్టడానికి అనేకవిధాలైన ప్రయత్నాలు చేసి విజయం పొందుతున్నారు.

హైదరాబాదులో స్త్రీల నిమిత్తం కొన్నుల వైద్యశాల వొకటున్నది. అట్టివి జిల్లాలలోనూ తాలూకాలలోనూ కూడా నెలకొల్పవలసివున్నది.

నైజాము సర్కారు యునానీ వైద్యము కూడా బాగా ప్రోత్సాహపరుస్తున్నారు. వారు, హైదరాబాదులో, చార్‌మినారువద్ద "నిజామియా దవాఖానా" అనే పేరితో గొప్ప యునానీవైద్యశాల నడిపిస్తున్నారు. ఔషధాలూ, అక్కడ ఉచితంగా యిస్తారు.

ప్రతీ తాలూకాలోనూ కూడా యునానీ హకీములను ఏర్పాటు చేస్తున్నారు. అదివరకే వున్న సమర్థులైన హకీములకు గ్రాంట్లు ఇస్తున్నారు.

కాని నైజాముసర్కారు ఆయుర్వేదవైద్యాన్ని మాత్రం కడకంట నైనా చూడ్డం లేదు. ప్రజలే దాన్ని పోషించుకుంటున్నారు. ప్రజలలో నూటికి ౯౦ వంతులు ఆయుర్వేదచికిత్సలే చేయించుకుంటున్నారు.

మన మద్రాసు ప్రెసిడెన్సీలో, హిందువుల ప్రభుత్వం—అందులోనూ బ్రాహ్మణప్రభుత్వం—మళ్లీ అందులో కూడా కాంగ్రెస్సు ప్రభుత్వమే ఆయుర్వేదాన్ని నిరసిస్తున్నప్పుడు—తిరస్కరిస్తున్నప్పుడు—హేళన చేస్తున్నప్పుడు—దాంతో నాన్‌కోఆపరేషను చేస్తున్నప్పుడు నైజాము సర్కారు ఆయుర్వేదాన్ని పోషించకపోతే ఆశ్చర్యం యెందుకూ?

---

# వర్తమానాంధ్ర భాషానుశాసనము

### మండపాక పార్వతీశ్వరశాస్త్రి

ఆంధ్రభాషకు మొదట అనుశాసనము చాళుక్యుల కాలములో జరిగినది. అది కావ్యభాషకుమాత్రమే ఉయి ఉండెను. ఆనాడు కావ్యేతర వాఙ్మయమునకు అంతగా ప్రయోజనము లేకుండెను. భాష మారుతూ ఉన్నప్పుడు కవుల ప్రయోగాలు మారుతూఉండెను. దానిని అనుసరించి, వ్యాకరణాలలో క్రొత్తసూత్రాలు కలుపుట జరుగుతూఉండెను. ఈవిధముగా కావ్యభాషానుశాసనము పెరుగుతూ ఉండెను. కావ్యేతర వాఙ్మయమారంభమైనది. శతకములు, పాటలు, కథలు, వ్యాఖ్యానములు, శాస్త్రములు ఈ మొదలగు కావ్యేతర రచనలు పెచ్చుపెరిగినవి. వీటిలో, కథలు, వ్యాఖ్యానములు, శాస్త్రములు, కేవలవ్యవహారభాషలోనే పుట్టినవి. పాటలలో నూటికి ముప్పాతిక వాడుకమాటలే. శతకములలో నూటికి ఏబది వాడుకమాటలు. స్వతంత్రకవులకావ్యములలో నూటికి ఇరువదియైదు వాడుకమాటలు. ఈవిధముగా వాడుకభాషకు ప్రయోజనము కలిగిఉండెను.

పందొమ్మిదవ శతాబ్దమున రెండు సంచలనములు కలిగినవి.

(౧) ఇంగ్లీషువాళ్ళలో గద్యకావ్యపఠన.